ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 9 జూన్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.180	250	280
నల్లగొండ	రూ.170	246	280

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 24.4

రెండు అండర్‌పాస్ మార్గాల్లో ఒక దాన్ని పూర్తిగా, రెండో దాంట్లో సగం వరకు ఏర్పాటుచేసిన దుకాణాలు



వైటీడీఏ పనులకు నిధుల కొరత



యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి కొండ పైన పాత నిర్మాణాలు తొలగించి ఆలయం మిన హా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని గత ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేకంగా భక్తుల కొండ కింద దుకాణ సముదాయాల నిర్మాణాలను మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా వైటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టింది. ఆ పనులు చివరిదశలో నిధుల కొరతతో నిలిచాయి. ఎన్నికల కోడ్ ముగుస్తున్న నేపథ్యంలో నిధులు విడుదల అవుతుందొచ్చని వైటీడీఏ అధికారులు భావిస్తున్నారు. కాగా, ఇదే తరుణంలో 2026 వరకు కొండపై వర్తకం నిర్వహించేందుకు కోర్టు స్టే ద్వారా వర్తకులు అనుమతి పొందారు. ఈ మేరకు తాత్కాలికంగా 10 దుకాణాలు విష్ణు పుష్కరిణి ఎదురుగా ఉన్న అండర్‌పాస్‌తో పాటు ఆ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటుచేసుకోగా, భక్తుల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది.

- భువనగిరి అర్బన్

» నిలిచిన దుకాణసముదాయాల నిర్మాణాలు
» ఆర్టీసీ బస్టాండ్ పనులు రూ.5 కోట్ల మేర పెండింగ్

భక్తుల సౌకర్యార్థం కావాల్సిన నిర్మాణాలు కొండ కింద చేపట్టేందుకు గండి చెరువు నుంచి ఊరకుంట చెరువు వరకు రెండు విడతల్లో 73, 78 నుంచి 119 సర్వేనంబర్ల వరకు తొలి విడతలో 93.03 ఎకరాలు, మలివిడతలో 49.24ఎకరాలు కలిపి 142.27 ఎకరాల వ్యవసాయ భూములను అప్పటి ప్రభుత్వం సేకరించింది. ఈ భూముల్లో తేపోత్సవం(గండి చెరువు) లక్ష్మీపుష్కరిణిని, ఆర్టీసీ బస్టాండ్, అన్నదాన సత్రం, కల్యాణ కట్ట, సత్యదేవుడి వ్రత మండపం, కొండ పైన వ్యాపారులు, కొండకింద రోడ్డు బాధితుల కోసం దుకాణ సముదాయాలు నిర్మించగా, మిగిలిన భూములను పార్కింగ్ కోసం కేటాయించారు.

కోర్టు స్టేతో 10 దుకాణాలు

ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండపైన దుకాణాలు ఖాళీ చేయించగా జీవనోపాధి కోల్పోయామని వర్తకులు కోర్టును ఆశ్రయించగా కొండ పైన 2026 వరకు 10 దుకాణాలకు కోర్టు అనుమతించింది. హోటళ్లు, కొబ్బరికాయల దుకాణాలు, జనరల్ దుకాణాలు, బొమ్మల దుకాణాలు, ఫొటో స్టూడియో తాత్కాలికంగా ఏర్పాటుచేసుకోగా, భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారానే 112 మంది వర్తకులు ఇక్కడ విడతల వారీగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

కొండకింద దుకాణ సముదాయాలు

దుకాణదారుల కోసం కొండకింద అన్నదాన సత్రం సమీపంలో 162దుకాణ సముదాయాలకు రూ.13కోట్లు కేటాయించగా, రూ.8కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. మరో రూ.5కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 166(నిర్వాసితుల కోసం బస్టాండ్ పక్కన వేరుగా) దుకాణ సముదాయాల కోసం రూ.60కోట్లు మంజూరు కాగా, రూ.50కోట్ల పనులు పూర్తయ్యాయి. రూ.10కోట్లతో నిర్మించాల్సిన ఆర్టీసీ బస్టాండ్ పనుల్లో రూ.5కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ ముగుస్తున్న నేపథ్యంలో నిధులు మంజూరు కావొచ్చని వైటీడీఏ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ దుకాణాల ఏర్పాటు స్థలాభావం కారణంగా విష్ణుపుష్కరిణి ఎదురుగా భక్తులు కాలినడకన వెళ్లే దారి(అండర్‌పాస్) లో ఏర్పాటుచేశారు. శివాలయం, ప్రసాదాల కౌంటర్, ప్రధానాలయానికి తూర్పుదిక్కు నుంచి భక్తులు నడిచే ప్రధాన దారి వెంట అండర్‌పాస్‌లో ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రద్దీ దినాల్లో ఈ దారి వెంట భక్తులు నడవలేకపోతున్నారు. నిధులు విడుదల కాగానే చివరి దశ పనులు పూర్తి చేస్తామని వైటీడీఏ ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత కొండకిందకు తరలించాల్సి దుకాణాలను అధికారుల ఆదేశాలతో నిర్ణయం తీసుకుంటామని ఆలయ పరిపాలన విభాగం ఏఈవో గట్టు శ్రావణ్‌కుమార్ తెలిపారు.



అండర్‌పాస్ మార్గాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలు



దుకాణ సముదాయాలు దేవస్థానం ఆధీనంలోకి రాలేదు..

కొండ కింద నిర్మించిన దుకాణసముదాయాలు వైటీడీఏ నుంచి దేవస్థానం ఆధీ నంలోకి రాలేదు. ప్రస్తుతం 2026 వరకు కొండపైన నిర్వహించుకునేందుకు కోర్టు స్టే ఉంది. 10దుకాణాలకు నెలవారీగా అద్దె రూ.12లక్షలతో పాటు జీఎస్టీ రూ.2,40,000 చెల్లిస్తున్నారు. దుకాణ సముదాయాల అప్పగింత, విధించిన కోర్టు స్టే ఎత్తివేత ప్రక్రియలు పూర్తి కాగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

- శ్రావణ్, గుట్ట దేవస్థానం పరిపాలన విభాగం ఏఈవో

నిధులు విడుదల కాగానే పనులు పూర్తి చేసి అప్పగిస్తాం..

162 దుకాణ సముదాయాల చివరిదశ పనులు నిధుల కొరతతో నిలిచాయి. నిధులు రాగానే పనులు పూర్తి చేసి అప్పగిస్తాం.అదేవిధంగా కొండకింద బస్టాండ్ పక్కన రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల కోసం 166దుకాణ సముదాయాలు కూడా నిర్మాణంలో ఉన్నాయి. నిధుల్లేక పెండింగ్‌లో ఉండగా సముదాయాల్లో పనులు పూర్తి కాగానే దేవస్థానం స్వాధీనం చేస్తాం.

- వెంకటేశ్వరరెడ్డి, వైటీడీఏ ఈఈ

ఉపాధ్యాయ బదిలీలు,పదోన్నతుల

ప్రక్రియ ఆలస్యం

» ఎన్నికల కోడ్ ఎత్తేశాకే కొనసాగనున్న ప్రక్రియ
» రేపటి నుంచి మొదలయ్యే అవకాశం



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆలస్యం కానుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఇంకా కొనసాగుతుండటంతో రెండు రోజులు ఆలస్యం కానుంది. ఈ నెల 10వ తేదీ సోమవారం నుంచి మొదలయ్యే అవకాశం ఉంది. ఆదివారం వరకు కూడా కోడ్ అమలులో ఉంది.

- నల్లగొండ

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసినా, జిల్లా విద్యాశాఖకు ఎలాంటి ప్రొసీడింగ్స్‌ను జారీ చేయలేదు. వాస్తవానికి శనివారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. పూర్తి గా ఆన్‌లైన్ ద్వారానే కావడంతో రెండో శనివారం అయినా, ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయడమే కాకుండా ఇతర మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే కోడ్ కారణంగా ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈనెల 30వ తేదీ వరకు మల్టీజోన్-2లో పదోన్నతుల, బదిలీల ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే జారీ చేసిన నిబంధనల మేరకు షెడ్యూల్ ఉంటుందా? లేదా? మారుతుందా? అనే దానిపై ఉపాధ్యాయులపై సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ 8, 9వ తేదీల్లో జరగాల్సిన ప్రక్రియను 10వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు సమాచారం. ప్రక్రియ ప్రారంభం ఆలస్యం కానుండటంతో జూలై 1, 2 తేదీల వరకు చివరి గడువును పొడగించనున్నారు. తొలుత స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించి బదిలీల ప్రక్రియ ప్రారంభిస్తారు. అనంతరం ఏర్పడిన స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను ఎస్జీటీలకు పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు.

గత మార్గదర్శకాలతోనే పదోన్నతులు, బదిలీలు

గత ఏడాది జారీ చేసిన షెడ్యూల్‌లో కటాఫ్ డేట్‌ను ఆగస్టు నెలాఖరు వరకు ప్రకటించారు. కోర్టు కేసుల కారణంగా ఆ ప్రక్రియ నిలిచింది. ప్రభుత్వం ఆ షెడ్యూల్‌నే పొడిగిస్తూ రీషెడ్యూల్‌ను ఈ నెల 7న విడుదల చేసింది. ఈ ఆరునెల కాలంలో ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా మార్గదర్శకాలు లేవు. వివిధ వ్యాధులతో ఇబ్బందిపడుతున్న వారికి వెసులుబాటు కల్పించే విషయంలో స్పష్టత లేకపోవడంతో ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారు. మూడేళ్లలోపు సర్వీస్ ఉన్న వారికి మినహాయింపు ఇచ్చినప్పటికీ, రీషెడ్యూల్ జారీ చేసిన సమయానికి చాలా మంది ఉపాధ్యాయులకు మూడేళ్ల సర్వీసు ఉండగా, దీనిపై మార్గదర్శకాలు జారీ చేయలేదు. గతంలో మూడేళ్లకుపైగా సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులందరూ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం వారికి మూడేళ్లలోపు సర్వీస్ మాత్రమే ఉండటంతో ఎడిట్ ఆప్షన్ సౌకర్యం కల్పిస్తే వారు యథాస్థానంలో ఉంటారు. లేదంటే స్థానచలనం తప్పదు. ఒకవేళ ఎడిట్ ఆప్షన్ ఇస్తే మొత్తం ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

పండిట్ల అప్‌గ్రేడేషన్‌ను ప్రారంభించాలి : భాషా పండితుల అప్‌గ్రేడేషన్ ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎండీ యూసుఫుద్దీన్ కోరారు. ఈ మేరకు డీఈవో భిక్షపతిని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ.వహీద్అలీ, నాయకులు సింహాద్రి, ఆర్.మాధవరెడ్డి పాల్గొన్నారు.

బుద్ధవనాన్ని ప్రతీ ఒక్కరు సందర్శించాలి

పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



బుద్ధవనాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగార్జునసాగర్, జూన్ 8: ప్రపంచంలో ఉన్న ప్రతీ ఒక్కరు వారి జీవితంలో ఒక్కసారైన సందర్శించాల్సి ప్రాంతం బుద్ధవనం అని పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. టూరిజం ప్రమోషన్‌లో భాగంగా శనివారం సాగర్ హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టును ఆయన సందర్శించారు. బుద్ధవనం చేరుకున్న ఆయన బుద్ధ చరిత వనం, జాతక వనం, స్తూప వనం, ధ్యాన వనం, మహాస్తూపాన్ని సందర్శించారు. అనంతరం మహాస్తూపం లోపల ధ్యానం చేశారు. బుద్ధవనం అధికారులతో సమీక్షా నిర్వహించి బుద్ధవనంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో బుద్ధవనాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. బుద్ధవనానికి వస్తున్న అంతర్జాతీయ , జాతీయ పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కాగా, పర్యాటకశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా ఇక్కడికి వచ్చిన జూపల్లిని విజయవిహార్ హోటల్ మేనేజర్ మిట్టపల్లి శ్రీనివాస్ సత్కరించారు. కార్యక్రమంలో సాగర్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడిని దర్శించుకున్న జూపల్లి

దేవరకొండ: చింతపల్లి సాయినాథుడిని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయకమిటీ అధ్యక్షుడు ధనంజయ్యతో పాటు నిర్వాహకులు మంత్రి జూపల్లికి స్వాగతం పలికి సన్మానించారు. ఇదిలా ఉండగా, ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో రెండో రోజు శనివారం ఉదయం 8 గంటలకే మండపారాధన పూజలు, లక్ష్మీనర్సింహస్వామి హోమం, లక్ష్మీకామదేవిహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కొడగొండ్ల రామశరణ్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కు తీర్చుకున్నారు.

మూసీకి పుష్కల జలం..

కన్నీటి సాగరం

హైదరాబాద్ జంట నగరాల నుంచి వచ్చే వృథా నీటికి, మూసీ ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షపు నీరు తోడవడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో పెద్ద నీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటోంది. 623 అడుగుల కనిష్ఠ స్థాయి నుంచి మండు వేసవిలో సైతం ప్రాజెక్టు నీటిమట్టం 636.20 అడుగులకు చేరింది. ఈ క్రమంలో 40 రోజుల్లో మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 13 అడుగుల మేర పెరిగి వరద నీటితో ప్రాజెక్టు కళకళలాడుతోంది. నాగార్జునసాగర్‌లో దీనికి భిన్న పరిస్థితులు ఉన్నాయి. ప్రాజెక్టు కనిష్ఠ నీటిమట్టం 510 అడుగులు కాగా, దీనికి దిగువకు 504.70 అడుగుల వద్ద ప్రాజెక్టు నీటిమట్టం ఉంది.

- కేతేపల్లి, నాగార్జునసాగర్

» పూర్తిస్థాయి నీటిమట్టానికి 10 అడుగుల దూరంలో మూసీ
» కనిష్ఠ నీటిమట్టానికి దిగువకు నాగార్జునసాగర్

వేసవిలో మండే ఎండలకు రాష్ట్రంలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు ఎండి బీటలు వారుతుంటే మూసీ ప్రాజెక్టు నీటిమట్టం మాత్రం ఒక్కో అడుగు పెరుగుతూ గరిష్ఠస్థాయికి 10 అడుగుల దూరంలో ఉంది. వానాకాలం నాటికే ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువలోకి వస్తుండటం, ఆయకట్టు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నీటిమట్టం గత నెల (ఏప్రిల్) 27వ తేదీ నాటికి 623.10 అడుగుల (0.67టీఎంసీలు) కనిష్ఠ స్థాయిలో ఉంది. ఈ క్రమంలో ఎగువ మూసీ నదికి ఇరువైపులా పరివాహక ప్రాంతాల్లోని ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నహర్ కత్వలు, ఇతర ఫీడర్ ఛానళ్లకు మళ్లించిన హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటితో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాల్లోని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగు పోస్తున్నాయి. ఆయా చెరువులు, కుంటల అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన ఉన్న మూసీ ప్రాజెక్టుకు చేరుతోంది. మరోవైపు హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు వరద మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. దీంతో గత 40 రోజులుగా ప్రాజెక్టుకు 600 నుంచి 1,000 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 636.20 అడుగులుగా(2.41 టీఎంసీలు) నమోదైంది. ఎగువ నుంచి 750.57 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 64.35 క్యూసెక్కుల మేర నీరు లీకేజీలు, ఆవిరి రూపంలో వెళ్తోంది. కాగా, గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 641.80 అడుగులు (3.47టీఎంసీలు)గా, ఇన్‌ఫ్లో 625 క్యూసెక్కులుగా ఉంది.

504అడుగుల వద్ద సాగర్

నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం గత ఆరేళ్లతో పోలి స్తే ఈ ఏడాది ఆందోళనకరంగా మారింది. ఆరేళ్ల క్రితం సాగర్ ప్రాజె క్టు నీటిమట్టం కనిష్ఠ స్థాయి 510 అడుగుల దిగువకు చేరుకుంది. తిరిగి ఈ ఏడాది కనిష్ఠ స్థాయి దిగువకు నీటిమట్టం చేరుకుంది. గత ఏడాది కృష్ణానది బేసిన్‌లో సరిపడా వర్షాలు పడకపోవడంతో ప్రాజెక్టు ల్లో కేవలం తాగు నీటి అవసరాలకు మాత్రమే నీరుంది. దీంతో సాగర్ ప్రాజెక్టు ఆయకట్టులో క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ ఏడాదైన వరుణుడు కరుణించి ఆయకట్టుకు సాగు నీటి విడుదల ఉంటుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 504.70 అడుగులుగా (122.8483టీఎంసీలు)ఉంది. సాగర్ నుంచి జంట నగరాలకు తాగునీటి అవసరాలకోసం పుట్టంగండి వద్ద ఎమర్జెన్సీ వద్ద మోటార్ల ద్వారా 800 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 800క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి ఎటువంటి నీటి రాక లేదు.



జలకళను సంతరించుకున్న మూసీ రిజర్వాయర్



వెలవెలబోతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్ట్

ముందస్తు వర్షాలు

ముమ్మరంగా వ్యవసాయ పనులు

నల్లగొండ: ఎన్నడూలేని విధంగా ఈఏడాది మే నెలలో అకాల వర్షాలు కురవడం, ఆతరువాత అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఉమ్మడి జిల్లా అంతటా రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. మే నెలాఖరులో రోహిణి కార్తెలో వేసవిదుక్కుల్లో పత్తి విత్తనాలు కూడా విత్తారు.దీనికి తోడు నైరుతి రుతుపవనాలు ఏడాది ముందుగానే రావడంతో వేసవిలో పత్తివిత్తనాల వేసిన రైతులు గట్టెక్కారు. నల్లగొండ జిల్లాలో ఈనెల ఈనెల 8వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 20.9మి.మీకు 109 మి.మీ వర్షం కురిసింది. ఈనెల 8వతేదీవరకు మొత్తం429.5 మి.మీ వర్షం కురిసింది. నల్లగొండ డివిజన్‌లో 387.3మి.మీ, మిర్యాలగూడ డివిజన్‌లో 523.6, దేవరకొండ డివిజన్‌లో 492.3, చండూరు డివిజన్‌లో 232.9మి.మీ వర్షం కురిసింది. చాలాచోట్ల రైతులు వరి నార్లుపోయగా, ఇప్పటికే 60శాతానికి పైగా పత్తి విత్తనాలు విత్తారు.

వానాకాలం సాగుకు అందుబాటులో విత్తనాలు

● 104 కేంద్రాల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు ● టీజీ సీడ్స్ రీజనల్ మేనేజర్ కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న సీడ్స్ ఆర్ఎం కృష్ణవేణి

నిడమనూరు, జూన్ 8: వానాకాలం సీజన్‌లో సాగుకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు విత్తనాభివృద్ధి సంస్థ అందుబాటులో ఉంచిందని టీజీ సీడ్స్ నల్లగొండ రీజనల్ మేనేజర్ సీహెచ్ కృష్ణవేణి తెలిపారు. శనివారం నిడమనూరులోని టీజీ సీడ్స్ యూనిట్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర 60శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్నామన్నారు. వరి, అపరాలకు మాత్రం సబ్సిడీ లేదన్నారు. ఉమ్మడి జిల్లాలోని 68 పీఏసీఎస్, 26 ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, నాలుగు డీసీఎంఎస్, నాలుగు రైతు సేవా సహకార కేంద్రాలు, రెండు టీజీడీసీ మొత్తం 104 కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే ఆయా కేంద్రాల్లో 1,200 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామన్నారు. 2147.25 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగ 30కిలోల విత్తనాల ధర రూ.2790 కాగా, 60శాతం సబ్సిడీపై రూ.1,116లకు, జనుము 40 కిలోల విత్తనాలు రూ.3,620 కాగా, సబ్సిడీపై రూ.1,448, పిల్లిపెసర 20 కిలోలకు రూ.2,710 కాగా, రూ.1,084కు అందిస్తున్నట్లు తెలిపారు.వరిబీపీటీ 5204 రకం 25కిలోల బస్తా రూ.1,030, ఎంటీయూ 1010, జేజీఎల్ రకం వరి విత్తనాలు రూ.987కు ఇస్తున్నామన్నారు. మినుములు 4కిలోలబ్యాగ్ రూ.424,కంది రూ.599కు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

» మొత్తం 47 పరీక్ష కేంద్రాలు, 16,899మంది అభ్యర్థులు » ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



ఓ కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లను కేటాయిస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న రీజనల్ కోఆర్డినేటర్ ఉపేందర్

నల్లగొండ, జూన్ 8: జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 9వ తేదీన ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 47 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 16,899మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు. పరీక్షా కేంద్రాలకు మూడు కిలోమీటర్ల పరిధిలో జీరాక్స్ కేంద్రాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అన్ని కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సేవలు ఏర్పాటు చేయనున్నారు. ఆర్టీసీ బస్సులను సైతం అవసరమైన రూట్లలో నడపనున్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోనున్నారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

నల్లగొండ క్రైం: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ చందనాదీప్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 47 కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీస్‌శాఖ తరఫున అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సభలు, ఉరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. అనవసరంగా గుంపులు గుంపులుగా పరీక్షా కేంద్రాల పరిసరాల్లో తిరగడానికి అనుమతి లేదని, జిరాక్స్ షాపులు మూసి వేయాలన్నారు. బయోమెట్రిక్ విధానం అటెండెన్స్ తీసుకునే సిబ్బందికి అభ్యర్థులు సహకరించాలన్నారు.

అభ్యర్థులకు ముఖ్యమైన సూచనలు

- అభ్యర్థులు ఉదయం 10గంటల లోపే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. 10గంటల తరువాత వస్తే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరు.
- మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు, క్యాలిక్యులేటర్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్, వాచీలు, మ్యాథ్స్ టేబుల్స్, లాగ్‌బుక్స్, లాగ్ టేబుల్స్‌ను అనుమతించరు.
- వ్యాలెట్, హ్యాండ్‌బ్యాగులు, రైటింగ్ ప్యాడ్, వైట్ పేపర్లు, బంగారు ఆభరణాలకు అనుమతి లేదు.
- అభ్యర్థులు షూ, సాక్స్ ధరించకూడదు.
- పరీక్షకు మెహిందీతో హాజరుకాకూడదు.
- పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదు.
- ఉదయం 9.30 గంటల నుంచి అభ్యర్థుల బయోమెట్రిక్ ప్రారంభమవుతుంది.
- బయోమెట్రిక్ నమోదుకాని అభ్యర్థులు ఓఎమ్మార్ షీట్‌ను మూల్యాంకనం చేయరు.
- హాల్‌టికెట్‌పై ముద్రించిన సూచనలన్నింటినీ తప్పకుండా చదవాలి.

అంతర్‌జిల్లా దొంగ అరెస్టు

అక్కన్నపేట, జూన్ 8 : వరుస దొంగతనాలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట ఎస్ఐ తాండ్ర వివేక్ శనివారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలానికి చెందిన సిరిగిరి సాయిబాబా అలియాస్ సాయికుమార్ తాగుడు, గంజాయికి బానిసై దొంగతనాలను అలవాటుగా చేసుకున్నారు. గతంలో కరీంనగర్, వరంగల్, నల్లగొండ, హుజూర్‌నగర్, జనగాం, భువనగిరి ప్రాంతాల్లో చోరీలు చేసిన జైలు వెళ్లి వచ్చాడు. అయినా బుద్ధిమారక గత నెల 19వ తేదీన అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామంలో కనకయ్య ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశాడని ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా గంగాధర మండలం వెంకటాయపల్లి స్టేజీ వద్ద యూనికాన్ బైక్‌ను, మల్లంపల్లి గ్రామపాఠశాలలో నల్లాపైపులను చోరీ చేశాడని వివరించారు. అంతకపేట గ్రామంలో చోరీచేసిన సొత్తును కొండగట్టుకు వెళ్లి స్నేహితుడైన గంధం అర్జున్‌తో కలిసి విక్రయించాలని చెప్పగా అర్జున్ రూ.60 వేలకు విక్రయించి అందులో రూ.10 వేలు తీసుకుని మిగిలిన డబ్బును సాయిబాబాకు ఇచ్చాడు. ఆ డబ్బులను అవసరాలకు, జల్సాలకు సాయిబాబా ఖర్చు చేశాడు. శనివారం ఉదయం ఐదు గంటల సమయంలో భార్యాపిల్లలను చూసేందుకు చోరీచేసిన బైక్‌తో వస్తుండగా పట్టుకుని విచారించినట్లు తెలిపారు. విచారణలో చోరీ చేసినట్లు తేలడంతో అతడి నుంచి 30 గ్రాముల బంగారం, 166 గ్రాముల వెండి, యూనికాన్ బైక్‌ను, వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకుని హుస్నాబాద్ కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేత

వలిగొండ, జూన్ 8 : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన చెవ్వ మీనయ్యకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి శనివారం రూ.2.50 లక్షల ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. ప్రస్తుతం మీనయ్య అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన వైద్య ఖర్చులకు చెక్కును ఎమ్మెల్యే ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, నాయకులు వెంకటేశం, యాదయ్య, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో.. తస్మాత్ జాగ్రత్త

- బ్యాంకు ఖాతా, ఏటీఎం, డెబిట్ కార్డు వివరాలు చెబితే డబ్బులు ఖాళీ
- అధికారులను వదలని సైబర్ నేరగాళ్లు
- జిల్లాలో ఇప్పటికే పలువురు బాధితులు

సూర్యాపేటటౌన్, జూన్ 8: ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలతో ప్రజల నుంచి డబ్బులు దోచుకోవడం వివిధ రకాలుగా జరుగుతోంది. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్‌లనే లక్ష్యంగా చేసుకుని ఆఫర్లు ఉన్నాయని, కేవైసీ చేసుకోవాలని మెసేజ్‌ల రూపంలో లింక్‌లు పంపుతున్నారు. ఇదేసమయంలో ఏమాత్రం లింక్‌లు క్లిక్ చేసినా బ్యాంకులో నగదు గల్లంతవుతోంది. గతంలో కొంత మంది ఇళ్లలోకి చొరపడి చోరీలకు పాల్పడి నగదు, బంగారు అభరణాలను చోరీ చేస్తుంటారు. మరికొందరు నగదును తీసుకెళ్తుండగా ఏమార్చి అపహరిస్తున్నారు. ఇలా కాకుండా ఇటీవల నేరగాళ్లు సైబర్ నేరాలకు తెరలేపారు. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉన్న కొంతమంది వ్యక్తులు ఇలాంటి నేరాలకు పాల్పడుతూ ప్రజల నుంచి డబ్బులు కాజేస్తున్నారు. వారు ఎక్కడో ఒక చోట ఉండి ప్రజలకు ఫోన్లు, మెసెజ్‌లు పంపి వారి వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలను మాయమాటలతో తెలుసుకొని మోసగిస్తున్నారు. బ్యాంకు ఖాతాలో నుంచి డబ్బులు పోయేంత వరకు కానీ బాధితులకు మోసపోయామని తెలియని పరిస్థితి నెలకొంది. ఇలాంటి సైబర్ నేరాలు ప్రస్తుతం సమాజంలో ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు పదే పదే చెబుతున్నా నేరాలు మాత్రం జరుగుతూనే ఉన్నాయి.

సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి. కళ్లెదుట నేరం చేసే వ్యక్తుల కంటే ఈ సైబర్ నేరగాళ్లు చేసే మోసాలు ఎక్కువయ్యాయి. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగిన వ్యక్తులు తప్పుడు చిరునామాలతో పలురకాల సిమ్‌కార్డులను కొనుగోలు చేసి, మెయిల్ అడ్రస్‌లు కూడా తప్పులుగా నమోదు చేసి నేరాలకు పాల్పడుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరహాలోనే నేరాలు కూడా పెరుగుతున్నాయి. నేరగాళ్లు కొత్తపంథాలో నేరాలకు పాల్పడుతున్నారు. ఈ సైబర్ నేరానికి పాల్పడే వారు అమాయక ప్రజల గుర్తింపు కార్డులను కూడా వాడుకుంటున్నారు. వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. ఇలాంటి వారితో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాస్‌వర్డ్ చెబితే డబ్బులు ఖాళీ

గుర్తుతెలియని వ్యక్తులు వివిధ రకాలుగా నమ్మబలుకుతూ మోసగిస్తున్నారు. తాము బ్యాంక్‌కు సంబంధించిన అధికారులమని, లాటరీలో బహుమతి వచ్చిందని, కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామని లేదంటే తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని, పలు ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మపలుకుతూ ప్రజల నుంచి బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్‌కార్డుల వివరాలు, పాస్‌వర్డ్, బ్యాంకు ఓటీపీ వివరాలు అడుగుతున్నారు. వాటి ద్వారా వారికున్న సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకు ఖాతాల్లో నిల్వ ఉన్న నగదును ఆన్‌లైన్‌లోనే కాజేస్తున్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్ కొనుగోలు, విక్రయాల విషయంలో కూడా మోసగిస్తున్నారు. ఇలా ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు ఈవిధంగా నమ్మపలికినా, సెల్‌ఫోన్‌కు, మెయిల్ అడ్రస్‌కు మెసెజ్‌లు పంపినా, డబ్బులు కాజేసే అవకాశాలు ఉన్నాయి.

మాయమాటలతో నేరాలు

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఇప్పటికే సూర్యాపేట జిల్లాలో కొంతమంది ప్రజలు చిక్కుకున్నారు. అమాయకులను మభ్యపెడుతూ అందినకాడికి దోచుకుంటునే ఉన్నారు.సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్లు రెండు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే ప్రయత్నం చేశారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే పేరుతో సైబర్ నేరగాళ్లు సూర్యాపేటకు చెందిన ఒక వ్యక్తికి నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి ఎస్పీ రాహుల్‌హెగ్డే పేరుతో ఆరోగ్యం ఎలా ఉందని టెస్ట్‌మెసేజ్ చేశారు. నా ఫ్రెండ్ సీఆర్‌పీఎఫ్‌లో పనిచేస్తున్నాడని అతను రూం ఖాళీ చేస్తున్నాడని అతిచౌకగా ఫర్నిచర్ ఇస్తున్నాడని వీలైతే తీసుకో అని మెసేజ్ పంపించాడు. నాఫ్రెండ్ ఫోన్ చేస్తాడని మొబైల్‌నెంబర్ పంపించమని ఎస్పీ పేరుతో సదరు వ్యక్తికి టెస్టు మెసేజ్ చేశారు. ఆ తర్వాత కాసేపటికి సీఆర్‌పీఎఫ్ ఉద్యోగిని అంటూ ఫోన్ చేయడంతో పాటు కొంతనగదును ముందుగా ఆన్‌లైన్‌లో పంపించాలని చెప్పడంతో సదరు వ్యక్తికి కొంత అనుమానం వచ్చి ఎస్పీ పీఆర్‌వోకు సమాచారం ఇవ్వడంతో పీఆర్‌వో ఎస్పీ దృష్టికి తీసుకుపోగా అవి నకిలీ ఫేస్‌బుక్‌లు అకౌంట్లు అని, ఎలాంటి నగదు పంపవద్దని ఎస్పీ చెప్పారు. అదేవిధంగా డీఎంహెచ్‌వో కోటాచలం కొద్ది నెలల క్రితం సైబర్ నేరగాళ్ల వలలోచిక్కాడు. కలెక్టర్ పేరుతో ఫేస్‌బుక్ ద్వారా మెసేజ్ చేసి నగదును కాజేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారులను, ఉద్యోగులను, అధికారులను, అమాయకులను ఈ మాయగాళ్లు మోసం చేస్తున్నారు. జిల్లాలో ఏడాది నుంచి 641 సైబర్ కేసులు నమోదుకాగా రూ.1.88 కోట్లు నగదును కాపాడగలిగారు.

ఖాతా వివరాలు చెప్పొద్దు



ప్రజలు గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు ఏ పరిస్థితుల్లో చెప్పొద్దు. వాటి ద్వారా కొంతమంది సైబర్ నేరగాళ్లు మోసగించి డబ్బులు కాజేస్తున్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్ ఉన్నారు. ఈవిధంగా ఎవరైనా మోసపోయినట్లు గుర్తిస్తే 24 గంటల్లోపు సంబంధిత పోలీస్ స్టేషన్లలో సమాచారమివ్వాలి. ఆవిధంగా సమాచారం ఇచ్చిన వారి బ్యాంకు ఖాతాను నిలుపుదల చేయించి ఖాతా నుంచి డబ్బులు పోకుండా చూస్తాం. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారమివ్వాలి.

● రాహుల్‌హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట జిల్లా

గృహవినియోగదారుడికి గ్రామ వీధిదీపాల బిల్లు

- ఒక్కనెలకే రూ.33,303 బిల్లు
- సరిచేస్తామని చెప్పి రెండు నెలలు



వినియోగదారుడికి వచ్చిన రూ.33,303 వేలు

నార్కట్‌పల్లి, జూన్ 8: ఓ సాదాసీదా గృహ విద్యుత్ వినియోగదారుడికి విద్యుత్ శాఖా కరెంటు బిల్లు 'షాక్' ఇచ్చింది. మహా అయితే నెలకు రూ.200లు లేదా రూ.300 బిల్లు వచ్చే ఆ ఇంటికి ఏకంగా రూ.33,303 బిల్లు వేసింది. బిల్లు చూసిన వినియోగదారుడు ఇదేంటని విద్యుత్ సిబ్బందిని నిలదీస్తే సరిచేస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా, యధావిధిగా ప్రతీ నెలా బకాయి కింద వస్తూనే ఉంది. ఎన్నికల వాగ్దానాల అమలులో భాగంగా 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఓ వైపు ఉచిత కరెంటు కింద 'జీరో' బిల్లును ఇస్తుండగా విద్యుత్ శాఖ నిర్వాకంతో బాధిత వినియోగదారునికి మాత్రం ఇంకా బిల్లు బకాయి చూపిస్తూనే ఉంది. ఈ విచిత్రం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బీ.వెల్లెంలలో వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం విశ్వనాథుల పిచ్చయ్యకు గ్రామంలో చిన్నపాటి ఇల్లు ఉంది. 4050700328 పేరిట సర్వీస్‌నెంబర్‌తో గృహ విద్యుత్ కనెక్షన్ గత డిసెంబరులో ఇంటివెనక చెట్లకొమ్మలను నరికే క్రమంలో సర్వీస్ వైర్లు తెగిపోయాయి. దీంతో కొత్త సర్వీస్‌వైరు తెచ్చుకోగా విద్యుత్ సిబ్బంది తిరిగి ఆ ఇంటికి కనెక్షన్ ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇక్కడే జరిగిన పొరపాటుతో మీటరు విష్ణుచక్రంలా తిరిగి కరెంటు బిల్లు ఒక్క నెలలోనే రూ.33,303 వచ్చింది. ఈ విషయాన్ని పిచ్చయ్య విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాడు. స్తంభం ఎక్కి పరిశీలించగా గ్రామంలో వీధిదీపాల వైరుకు మీటరు కనెక్షన్ ఇచ్చినట్లు గుర్తించారు. ఈ కారణంగానే బిల్లు ఎక్కువగా వచ్చినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లారు. బిల్లును రద్దు చేయాలంటూ సదరు అధికారి శాఖా అకౌంట్స్ విభాగానికి లేఖ రాశారు. ఇది జరిగి రెండు నెలలైనా బిల్లు బకాయి అలాగే వస్తుండటంతో హెల్పర్‌ను నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడని బాధితుడు ఆరోపిస్తున్నారు.

వచ్చే నెల బిల్లులోనైనా సరిచేస్తాం

బాధిత విద్యుత్ గృహ వినియోగదారుడు విశ్వనాథుల పిచ్చయ్య ఇంటి విద్యుత్ వాడకానికి సంబంధించి బిల్లు ఎక్కువగా వచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. మీటరులో సాంకేతిక లోపం ఉన్నట్లు గుర్తించి మీటరు మార్చాం. ఎక్కువగా వచ్చిన బిల్లును సరిచేయాలని సూచిస్తూ అకౌంట్స్ విభాగానికి లెటర్ కూడా రాశాం. బహుశా ఎన్నికల కారణంగా ఆలస్యం అయ్యుండొచ్చు. వచ్చే నెల బిల్లులోనైనా సరిచేసేలా చర్యలు తీసుకుంటా.

\- కే.చంద్రశేఖర్‌రావు, ఏఈ

రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు

నల్లగొండ / హుజూర్‌నగర్, జూన్ 8 : ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో రామోజీరావు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.

తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

పద్మవిభూషణ్ రామోజీరావు మృతి తెలుగురాష్ట్రాల ప్రజలకు తీరని లోటని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సామాన్య కుటుంబంలో జన్మించిన రామోజీరావు స్వశక్తితో ఎదిగి అక్షరశిల్పిగా మారారని, తెలుగువెలుగుతో అమ్మ భాషకు వన్నె తెచ్చేందుకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

గొప్ప మాతృభాషా ప్రేమికున్ని కోల్పోయాం: జగదీష్‌రెడ్డి

తెలుగు రాష్ట్రాలు గొప్ప మాతృభాషా ప్రేమికుడు రామోజీరావును కోల్పోయాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి హైదరాబాద్‌లో రామోజీరావు పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష పట్ల రామోజీరావుకు ఉన్న ప్రేమ, మమకారం, నిబద్ధతను జగదీష్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. రామోజీరావు మృతికి తీవ్రవిచారం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి ప్రకటించారు.



రామోజీరావు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

భువనగిరి అర్బన్, జూన్ 8 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి క్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. సుప్రభాత సేవతో గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు సువర్ణ ప్రతిష్టామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకారమండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేకవేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిపారు. ఈ ఆలయాల్లో సాయంత్రం వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనుబంధంగా కొనసాగుతున్న శివాలయంలో రామలింగేశ్వరస్వామి వారికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్యరుద్ర హవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.




ఆలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న పూజారి, ప్రసాద కౌంటర్ వద్ద దారిలో భక్తుల రద్దీ

సందడిగా ఉభయ క్యూలైన్లు

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రం స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో యాదగిరికొండపై సందడినెలకొంది. వేసవి సెలవులు ముగిసే చివరి వారాంతపు సెలవులతో పాటు రెండో శనివారం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు పిల్లాపాలతో రాష్ట్రం నలుమూలల నుంచి శనివారం తరలివచ్చారు. అధికసంఖ్యలో వాహనాలపై రావడంతో ఉభయ దర్శన క్యూలైన్లు కిక్కిరిసాయి. ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మదర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆలయ తిరువీధులు, పరిసరాలు భక్తుల తాకిడితో సందడిగా మారాయి. ప్రసాద కౌంటర్లు, దుకాణా సముదాయాలు, ఆలయ ఉత్తర దిశలోని మాఢవీధులో షెడ్డు కింద సేదతీరారు. కాగా, సుమారు 40వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ఉభయ క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు రద్దీకి సరిపడా బస్సులు నడపకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.56,14,368 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, బ్యాటరీ వాహనాలతో పాటు వీల్‌ఛైర్లు ప్రొటోకాల్ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. ఎలాంటి రుసుం లేకుండా వివరాలు నమోదు చేసుకొని దర్శనం ముగిసిన వెంటనే తిరిగి అదే కార్యాలయంలో అప్పగించాలని ఈవో తెలిపారు.

భార్య వేధింపులు తట్టులేక ఆత్మహత్య

హుజూర్‌నగర్, జూన్ 8 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో భార్య, అత్తింటి వారి వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాంనగర్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న చిట్టిప్రోలు రంజిత్(35) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. భార్య డీలర్‌గా పనిచేస్తోంది. కాగా భార్యభర్తల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు రాగా ఇరువురు ఘర్షణ పడుతున్నారు. గత కొంతకాలంగా భార్య, ఆమె కుటుంబసభ్యులు రంజిత్‌ను వేధింపులకు గురిచేస్తుండటంతో మనస్తాపానికి గురైన రంజిత్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం ఉరేసుకున్నాడు. సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. కాగా రంజిత్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రంజిత్ తల్లి చిట్టిప్రోలు పద్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారణచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



రంజిత్ (ఫైల్)

పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలి

నల్లగొండ కల్చరల్, జూన్ 8: పెండింగ్ నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవన్‌లో శనివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా పెండింగ్ నాలుగు డీఏలను ఇంతవరకు మంజూరు చేయకపోవడం అన్యాయమని అన్నారు. డీఏలను వెంటనే మంజూరు చేయాలని లేకుంటే పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. పింఛన్ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పెన్షనర్ల పుట్టినరోజు సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శేషారెడ్డి, గోవిందు సుధాకర్, ఆంజనేయులు, రంగయ్య, రామలింగం, నారాయణరెడ్డి, పుల్లయ్య, రఘునాథం, రమేష్, రవి ప్రసాద్, హుస్సేన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే వీరేశం


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, జూన్ 8: గంగాభవానీ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని అమ్మనబోలు మూసీ వాగు ఒడ్డున ఉన్న గంగా భవానీ ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన అమ్మవారి శాంతి కల్యాణానికి ఆయన హాజరై మాట్లాడారు. గంగాభవానీ మాత ఆశీస్సులతో గంగపుత్రులు తమ ఉపాధిరంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ నాయకుడు తవిడబోయిన గిరిబాబు, ఎంపీటీసీ కొంపెల్లి సైదులు, ఉత్సవ కమిటీ సభ్యులు షైనయ్య, ప్రసాద్, వెంకటేశ్వర్లు, మల్లేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న గెలుపులో సీపీఎస్ ఉద్యోగుల పాత్ర కీలకం

● **సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉపేందర్**

నల్లగొండటౌన్, జూన్ 8: ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయంపై తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టడంతో పాటు మల్లన్న కూడా సీపీఎస్ రద్దుకు కృషి చేస్తాననడంతో ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయ కుటంబాలు మల్లన్న గెలుపునకు కృషి చేశాయన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణ, వెంకయ్య, ఏడుకొండలు, చక్రపాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా మల్లన్న విజయంపై హర్షం

దేవరకొండ: నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించడంపై ఎమ్మెల్యే బాలునాయక్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మల్లన్న పోటీ చేయడంతో పట్టభద్రులు మల్లన్నకు ఓటు వేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

లోక్ అదాలత్‌లో 701 కేసులు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి వేణు

మిర్యాలగూడ లీగల్, జూన్ 8: మిర్యాలగూడ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 701 కేసులు పరిష్కరించినట్లు న్యాయ సేవా సంస్థ చైర్మన్, ఐదవ అదనపు జిల్లా జడ్జి జీ వేణు తెలిపారు. అంతకుముందు లోక్‌అదాలత్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కక్షిదారులు తమ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకొని సుఖమయ జీవితాన్ని గడపాలన్నారు. లోక్‌అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి బీ.సుజయ్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపూర్వరవళి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకినాల వేలాద్రి పాల్గొన్నారు. కక్షిదారులకు లయన్స్ క్లబ్ పులిహోర ప్యాకెట్లు అందజేసింది.

వైభవంగా కంఠమహేశ్వరస్వామికి బోనాలు

కనగల్, జూన్ 8: మండలంలోని పర్వతగిరి గ్రామ కంఠమహేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం గ్రామస్థులు స్వామివారికి బోనాలు చెల్లించారు. అనంతరం కంఠమహేశ్వరస్వామి సూరమాంబదేవిల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దగౌడ్ చెనగోని సైదులుగౌడ్, చినగౌడ్ పాలకూరి సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి'


సమావేశంలో మాట్లాడుతున్న భిక్షంగౌడ్

నల్లగొండటౌన్, జూన్ 8: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, అనేక రకాల ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వానికి అవగాహన ఉందని, హామీలు నెరవేరుస్తుందని టీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం కొనసాగించడం, షెడ్యూల్ రిలీజ్ చేయడంపై ప్రభుత్వానికి టీపీఆర్టీయూశాఖ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ ఉన్న డీఏలు పలు రకాల పెండింగ్ బిల్లులు రెండు, మూడేళ్లుగా రాక టీచర్లు ఎదురుచూస్తున్నారని అన్నారు. మిగతా సమస్యలు సైతం ప్రభుత్వం త్వరలో పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంకెన రాంచంద్రారెడ్డి, బత్తిని భాస్కర్ గౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చనగోని యాదయ్య, నాయకులు అద్దంకి సునీల్, రెబల్లి శరత్, కేశపోయిన గోపాల్, పొదిలి యాదగిరి, సముద్రాల నారాయణ, మిర్యాల మురళి పాల్గొన్నారు.

తోటలపై భానుడి ప్రతాపం


చండూరు మండలం లక్కినేనిగూడెంలో నీళ్ల లేక పూర్తిగా ఎండిపోయిన నిమ్మ, మామిడి తోట, తోటను నరికివేసి ట్రాక్టర్‌పై కలపను లోడ్ చేస్తున్న కూలీలు



- మండిన ఎండలు, ఎండిన తోటలు
- మండలంలో ఎండిపోతున్న నిమ్మ, బత్తాయి, మామిడి తోటలు
- భూగర్భజలాలు అడుగంటడంతో ఎండిపోతున్న బోర్లు
- చేసేదేమీ లేక తోటలను నరికివేస్తున్న రైతులు

చండూరు రూరల్, జూన్ 8: గత పది సంవత్సరాలలో ఏనాడు లేని విధంగా ఎండలు ఈ సంవత్సరం మండుతుండటంతో మండలంలో అక్కడక్కడ ఉన్న పండ్ల తోటలు ఎండిపోతున్నాయి. ముఖ్యంగా నల్లగొండ జిల్లాలో అధికంగా ఉండే బత్తాయి తోటలు పూర్తిగా కనుమరుగైపోతున్నాయి. వేసవి తాపానికి తట్టుకోలేక చండూరు మండలంలోని పలు గ్రామాల్లో బత్తాయి, నిమ్మ, మామిడి తోటలు పూర్తిగా ఎండి, పిందెలు, కాయలు నేలరాలుతున్నాయి. భూగర్భజలాలు పూర్తిగా అడుగంటడంతో కాయ కోతకు వచ్చే సమయంలో ఎండి రాలిపోతున్నాయి. మండలంలో పూర్తి గా 720 ఎకరాలు పండ్ల తోటలు సాగుచేస్తుండగా అందులో 330 ఎకరాలు బత్తాయి, 50 ఎకరాలు నిమ్మ, 80ఎకరాలు మామిడి, 200 ఎకరాలు ఆయిల్ పామ్, 60ఎకరాల్లో జామ, డ్రాగన్‌ఫ్రూట్, సపోటా, సీతాఫలం, బొప్పాయి వంటి పండ్ల తోటలను సాగు చేస్తున్నా రు. అందులో ముఖ్యంగా మండలంలోని గుండ్రపల్లి, కస్నాల, మెండువారిగూడెం, లక్కినేనిగూడెం, గోపిడివారిగూడెం, తుమ్మలపల్లి, చామలపల్లి, తిమ్మారెడ్డిగూడెం వంటి గ్రామాలలో సుమారుగా మండలవ్యాప్తంగా 100 ఎకరాల వరకు తోటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు.

తోటలను నరికివేస్తున్న రైతులు

కళ్లముందే నీళ్ల లేక తోటలు ఎండిపోతుండటంతో రైతులు చేసేదేమీ లేక తోటలను బొగ్గు బట్టీల వారికి ఇచ్చేస్తున్నారు. వారు తమ ఖర్చుతో వాటిని నరికివేసి బొగ్గుకు ఉపయోగపడే కలపను తీసుకుని మిగిలిన వాటిని తగలబెడుతున్నారు.

భూగర్భజలాలు అడుగంటడంతో ఎండిపోతున్న బోర్లు

రెండేళ్లుగా సరైన వర్షాలు లేక చెరువులు, బావులు ఎండిపోయి భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి పోయాయి. దీనికి తోడు వరిసాగు ఎక్కువగా చేస్తూ బోర్ల వాడకం ఎక్కువ కావడంతో భూగర్భజలాలను విచ్చలవిడిగా వాడుకుంటూ తోడేశారు. దీంతో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. తమ భూముల్లో ఉండే ఒకటి రెండు బోర్లలో నీళ్ల లేక తోటలు ఎండిపోవడం చూసి రైతులు కొత్తగా 400 నుంచి 600 ఫీట్ల వరకు బోర్లు వేయించినా చుక్కనీరు రాకపోవడంతో అప్పులపాలవుతున్నారు. మరికొంత మంది రైతులు ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీళ్లు పోయించి బతికించుకున్నారు.

బోర్లు వేసినా లాభం లేదు



మా కున్న 5 ఎకరాల్లో మామిడి, నిమ్మ, బత్తాయి తోటలను సాగుచేస్తున్నాను. గత 13 సంవత్సరాలుగా ఈ తోటలను సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాము. మామిడి 180 మొక్కలు, నిమ్మ 150 మొక్కలు, బత్తాయి 100 మొక్కలు ఉన్నాయి. కాని ఈ రెండు సంవత్సరాలుగా సరైన వర్షాలు లేక బోర్లలో నీళ్లు అడుగంటి బోర్లు పోయకపోవడంతో చెట్లు పూర్తిగా ఎండిపోయాయి. చెట్లు ఎండిపోతుండటంతో చూస్తూ ఊరుకోక లక్ష రూపాయలు ఖర్చు చేసి మరో రెండు బోర్లు వేయించాం. కానీ లాభం లేకపోయింది. దీంతో తోటను నరికి బొగ్గుల బట్టీల వారికి ఇచ్చేశాం. క్రాప్ డ్యామేజ్ కింద ప్రభుత్వం రైతులకు ఏదైనా ఆదుకోవాలి.

\- సామ ప్రభాకర్‌రెడ్డి, లక్కినేనిగూడెం, రైతు

ఎండిన పంటలపై సమాచారం లేదు

మండలంలో సుమారు 720 ఎకరాల్లో రైతులు పండ్లతోటలు సాగుచేస్తున్నారు. ఈ ఏడాది భూగర్భజలాలు అడుగంటిన మాట వాస్తవం. కానీ ఇప్పటి వరకు క్రాప్ డ్యామేజీ, తోటలు ఎండిపోయిన సంఘటనలపై ఎలాంటి సమాచారం తమ దృష్టికి రాలేదు. ఈ సమస్యపై రైతులకు నీటి గుంటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. రైతులు గతంలో ఎక్కువగా స్పందించకపోవడంతో సమస్యలు తలెత్తాయి. ప్రస్తుతం రైతులు అటువంటి పాంపాండ్ గుంతలను ఏర్పాటు చేసుకుంటే ఇబ్బందులను ఎదుర్కోవచ్చని సూచించాం.

\- శ్వేత, హార్టికల్చర్, క్లస్టర్ ఆఫీసర్

ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలి


దామరచర్ల: బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడటౌన్, దామరచర్ల, హాలియా, మాడ్గులపల్లి, కట్టంగూరు, చిట్యాల, కనగల్, జూన్ 8: ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. జిల్లాలోని పలు చోట్ల ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అపారమైన అనుభవం గల ఉపాధ్యాయులతో విద్యార్థులకు విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని పేర్కొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని బకాల్‌వాడీ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. బకాల్‌వాడీ పాఠశాలలో విశాలవంతమైన క్రీడామైదానం, తరగతి గదులు ఉన్నాయని సూచించారు. అనంతరం పదో తరగతిలో అత్యుత్తమ గ్రేడ్లు సాధించిన విద్యార్థులను అభినందించి డిక్షనరీలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, పద్మావతి, సైదమ్మ, అప్పమాంబ తదితరులు పాల్గొన్నారు.

● దామరచర్ల మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలను అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం చేపడుతున్న మరమ్మతు పనులు పాఠశాల పునఃప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ నందినిరవితేజ, జడ్పీటీసీ లలితహతీరాం నాయక్, ఎంపీడీవో మూర్తి, ఎంఈవో బాలాజీనాయక్, జడ్పీటీసీ అంగోతు లలితహతీరాంనాయక్, మాజీ సర్పంచ్ బంటు కిరణ్, హెచ్ఎం వెంకట్‌రెడ్డి, చందు, అశోక్‌కుమార్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● హాలియాలోని ప్రాథమిక పాఠశాల, అనుముల ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవో బాలునాయక్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, పాఠ్య, నోట్ పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పాఠశాలల హెచ్ఎంలకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాంమూర్తి, చంద్రుడునాయక్, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, గ్రేస్ రమోల, వెంకటరమణారెడ్డి, లోక్యానాథ్, నిర్మల, వెంకటేశ్వర్లు, మధు రజిత, సౌజన్య, శీలం చంద్రయ్య, రాములు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి మండలంలోని దాచారం, కుక్కడం, మాడ్గులపల్లి, కొత్తగూడెం గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారిని సీహెచ్.వెంకటమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, నాగేశ్వర్‌రావు, వెంకట్రాములు, వినోద, శ్రీనివాస్‌రెడ్డి, షరీఫ్, సైదులు, గుండా శ్రీను, పావని వెంకట్‌రెడ్డి, జుబేదా బేగం, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నోడల్ అధికారి వెంకటమ్మ

● కట్టంగూరు మండలంలోని కట్టంగూరు, ముత్యాలమ్మగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగం, జడ్పీటీసీ తరాల బలరాం మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పిల్లలను బడిలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కట్టంగూరు హెచ్ఎం అంబటి అంజయ్య, ఉపాధ్యాయులు ఎంఏగఫూర్, చంద్రయ్య, రాజేందర్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● చిట్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రెమిడాల లింగస్వామి, హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, బిక్షపతి నాయకులు రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని తుర్కపల్లి గ్రామంలో బడిబాట ర్యాలీని వైస్‌ఎంపీపీ రామగిరి శ్రీధర్‌రావు ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలో డబ్బు, అధికారమే ప్రభావితమైంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 8: నిన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు, అధికారమే ప్రభావితమైందని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పినా ఇంకా వారి ధోరణి మారలేదని పేర్కొన్నారు. అసలు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రాజీనామా చేయడం ఎందుకు, మళ్లీ పోటీల్లో నిలబడటం ఎందుకని ఆయన ప్రశ్నించారు. మొన్న జరిగిన ఎంపీ ఎన్నికల్లో రూ.300 కోట్లు బీఆర్ఎస్ ఖాతాల్లో జమ అయ్యాయని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆధారాలతో సహా ఆరోపించినా ప్రభుత్వం ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. దీనిని బట్టి చూస్తే రెండు పార్టీల మధ్య సఖ్యత ఉందనే అనుమానం వ్యక్తమవుతుందన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీగా గెలిచిన తీన్మార్ మల్లన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీన్నీ నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ కోసం తన కోసం నిరంతరం పని చేసిన కార్యకర్తలకు, ఓటు వేసి ఆదరించిన పట్టభద్రులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. చట్టసభలో తాను లేకున్నా పట్టభద్రుల పక్షాన నిలబడి పోరాటం చేస్తానని అన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు మరికొంత కష్టపడాలని సూచించినట్లు పేర్కొన్నారు. వచ్చే అన్ని ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మొదటగా ఈనాడు సంస్థ అధినేత రామోజీరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నూకల నర్సింహారెడ్డి, బండారు ప్రసాద్, పోతేపాక సాంబయ్య, నూకల వెంకటనారాయణరెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, కాశమ్మ, మహేష్ పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): ఈనాడు గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత రామోజీరావు మృతి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. జిల్లాలోని పలుచోట్ల ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామోజీరావు మృతి పత్రికరంగానికి, చిత్ర సీమకు తీరనిలోటని శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి తెలిపారు. విలువలతో కూడిన పత్రిక రంగానికి వన్నె తెచ్చారని తెలిపారు. ఈనాడు, ఈటీవి వివిధ సంస్థలను నెలకొల్పి లక్షలాది మందికి ఉపాధి కల్పించిన స్థాయికి ఎదిగిన ఆయన జీవితం ఆదర్శప్రాయమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబసభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతున్ని కోరుతున్నట్లు తెలిపారు.

ముప్పారంలో దేవాలయ భూముల కౌలు వేలం రేపు

నిడమనూరు, జూన్ 8: మండల పరిధిలోని ముప్పారం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి చెందిన మాన్యం భూములు కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 10వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ యడవెల్లి విజయ్‌కుమార్‌రెడ్డి, ఈవో సిరికొండ నవీన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయానికి చెందిన 67 ఎకరాల భూములు రైతులకు ఈ ఏడాది కౌలుకు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. వేలంలో పాల్గొనే రైతులు ముప్పారం శివారులోని 23 ఎకరాలు కౌలు పొందేందుకు రూ.10 వేలు, గుంటిపల్లి శివారులోని 44.31 ఎకరాల భూముల వేలం కోసం రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఆసక్తి ఉన్న రైతులు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే కౌలు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న ప్రసాద్

నల్లగొండ స్పోర్ట్స్, జూన్ 8: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని నల్లగొండ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో కేకేఆర్ ఫుట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంపు ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 30 రోజుల పాటు విద్యార్థులు ఫుట్‌బాల్ ఆటల్లో క్రీడా నైపుణ్యాల్లో తర్ఫీదు పొందారని అన్నారు. ఈ శిబిరాల వల్ల క్రీడల నైపుణ్యాల ప్రతిభ ఆధారంగా క్రీడాకారులకు సర్టిఫికెట్లను, దుస్తులను అందజేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకున్న క్రీడాకారులు వివిధ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాక్షించారు. నీలగిరి ఫుట్‌బాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఓరుగంటి శ్రీనివాస్, అసోసియేషన్ చైర్మన్ గంట అనంతరెడ్డి, కోచ్ కదికంట్ల దాసు, డాక్టర్ అరవింద్, బొడ్డుపల్లి సునీత, ప్రశాంత్, హుస్సేన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

దేవరకొండ: దేవరకొండ పట్టణానికి చెందిన రషీద్ క్యాన్సర్ వ్యాధితో ఇబ్బందులు పడుతుండటంతో వైద్యుల ఖర్చులకు గాను రూ.20వేలు అందజేసినట్లు అనీష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బెలిదె అనీష్‌కుమార్, రవీందర్ తెలిపారు.

దేవరకొండ: ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న విజయం సాధించడంపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు బీసీ సంఘం నాయకులు హర్షం ప్రకటించారు.

చిట్యాల: చిట్యాల కనకదర్గ ట్రాక్టర్ ఓనర్స్ అధ్యక్షుడిగా ఏర్పుల పరమేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సాగర్ల పవన్, కోశాధికారిగా దుర్గయ్య ఎన్నికయ్యారు.

కనగల్: మండలంలోని ఎంగౌరారం గ్రామ పరిధిలోని అనుముల మండల మారెపల్లి గ్రామ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవసాయ భూములకు సోమవారం కనగల్ రైతు వేదికలో కౌలు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 189. 33 ఎకరాలకు (1 నుంచి 70 ప్లాట్లు) వేలం జరుగుతుందని తెలిపారు. వేలంలో పాల్గొను రైతులు రూ.10 వేల చొప్పున డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

మునుగోడు రూరల్: భువనగిరి ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, వంగాల యాదగిరిరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు జంగిలి నాగరాజు తెలిపారు.

మర్రిగూడ: ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్న గెలుపు కాంగ్రెస్‌కు మరో విజయమని రాష్ట్ర ఆదివాసీ కమిటీ సభ్యుడు రమావత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. భువనగిరి ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ కైవసం చేసుకుందని, ఇప్పుడు తిరిగి ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ కైవసం చేసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా భువనగిరి ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డి అభ్యర్థుల గెలుపు కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మునుగోడు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు.

కొండమల్లేపల్లి: వారం రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని గౌరికుంటతండాలో ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ఇంట్లోని సామగ్రి, బియ్యం, జొన్నలు, తినే ఆహార పదార్థాలు తడిసిపోయాయి. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ సలహాదారుడు పస్నూరి యుగేందర్‌రెడ్డి 15 కుటుంబాలకు పది కిలోల బియ్యం చొప్పున పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు తనవంతుగా ఆదుకునేందుకు ముందుంటానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

తిరుమలగిరి(సాగర్): నీట్‌లో ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థినిని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అభినందించారు. ఎర్రచెరువు తండాకు చెందిన రమావత్ రవి, నీరజల కుమార్తె రమావత్ మణి ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 1525వ ర్యాంకు సాధించింది. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి తల్లి ఆసరాతో కష్టపడి చదివి ర్యాంకు సాధించింది. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి విద్యార్థిని మణితో పాటు వారి కుటుంబసభ్యులను సాగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పిలిపించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని శాలువాతో సత్కరించడంతో పాటు వైద్యవిద్య అభ్యసించేందుకు తోడ్పడుతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట రమావత్ రమేష్, సతీష్, వెంకట్, రూప ఉన్నారు.